క్లుప్తంగా

దుర్గమ్మను దర్శించుకున్న శ్రీముఖి, అవినాష్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను బుల్లితెర నటులు శ్రీముఖి, ముక్కు అవినాష్‌లతో పాటు పలువురు నటులు గురువారం దర్శించుకున్నారు. తొలుత వీరికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన నటులతో సెల్ఫీలు తీసుకునేందుకు యువత ఉత్సాహం చూపారు.

వ్యర్థాలతో నిండిన గుంటతిప్ప డ్రెయిన్



ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్ పరిధిలోని గుంటతిప్ప డ్రెయిన్ పూడుకుపోయింది. దీంతో మురుగు నీరు ముందుకు పారడం లేదు. సమీపంలోని పరిశ్రమల నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను ఇందులో పడవేస్తున్నారు. దీంతో డ్రెయినేజీలోని మురుగుకు ఈ చెత్తాచెదారాలు అడ్డుగా మారాయి. కనీసం ఇలా శానిటేషన్ సిబ్బంది కూడా తొలగించే విధంగా చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. దీనివల్ల దోమలు ఉత్పత్తి కేంద్రంగా మారింది. ఇక్కడ నగరపాలకసంస్థ డంపింగ్ యార్డు ఉంది. నగరంలోని చెత్తాచెదారాలను ఇక్కడకు తీసుకువస్తారు. ఈ డంపింగ్ యార్డు పక్కనే గుంటతిప్ప డ్రెయిన్ ఉంది. ఇక్కడ ఉన్న వ్యర్థాలన్నీ ఇందులో పడవేస్తున్నారు. దీంతో డ్రెయినేజీ పూడుకుపోయింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కనులపండువగా గ్రామోత్సవం



రామవరప్పాడు: సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలోని ముగ్గురమ్మలతో జరుగుతున్న గ్రామోత్సవం భక్తులతో అడుగడుగునా నీరాజనాలు అందుకుంటోంది. గత మూడు రోజులుగా రామవరప్పాడు ప్రధాన గ్రామంతో పాటు పురవీధుల్లో అమ్మవారి గ్రామోత్సవం కనుల పండువగా జరుగుతోంది. ప్రస్తుతం కాల్వగట్టు ప్రాంతం దూపాళ్ల కట్టపై అమ్మవారు పూజలు అందుకుంటోంది. భక్తులు అమ్మవారి రథాన్ని అనుసరిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలువురు మహిళలు ఉత్సవ వాహనం ఎదుట పసుపు నీళ్లు పోసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. అమ్మవార్ల గ్రామోత్సవం కనులారా వీక్షించేందుకు భారీ సంఖ్యలో పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. నిరాటంకంగా జరుగుతున్న గ్రామోత్సవం రామవరప్పాడులో పూర్తయిన తర్వాత ప్రసాదంపాడులో ప్రారంభమవుతుంది.

న్యాయం జరిగేలా విచారణ చేయండి

చందర్లపాడు(నందిగామ టౌన్): మృతి చెందిన వీరమణితేజ, కుటుంబానికి న్యాయం చేసేలా పోలీసులు విచారణ చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు పీఎస్‌లో గురువారం నందిగామ రూరల్ సీఐ చవాన్‌ను కలిసి మృతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అవినాష్, జగన్ మోహనరావు మాట్లాడుతూ మృతి విషయాన్ని సీపీ దృష్టికి తీసుకెళ్లామని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాలన్నారు. రెండు, మూడు నెలల నుంచి రాజకీయ ప్రేరేపిత చర్యలు జరుగుతున్నాయని మణితేజ మృతిలో తమకు, కుటుంబ సభ్యులకు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదమైతే శరీరంలో ఎక్కడో ఒక చోట గాయాలవుతాయని ద్విచక్ర వాహనం దెబ్బతింటుందని అటువంటివి ఏమీ కనిపించలేదని నడినెత్తిపై ఉన్న గాయాన్ని చూస్తే హత్యగానే అనిపిస్తోందని తెలిపారు. హత్య కేసుగా నమోదు చేసి ఆ కోణంలోనే దర్యాప్తు చేయాలని సూచించారు.

నిర్లక్ష్యం.. నీటి వృథా

- మంచి నీటి పైపు లైన్లకు లీకేజీలు
- బురదకయ్యగా మారుతున్న రోడ్లు

గాంధీనగర్: భవానీపురం 42వ డివిజన్ పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రం ఎదురుగా వాటర్ పైపులైన్ లీకై మంచి నీరు వృథాగా పోతోంది. తరచూ ఇక్కడే పైపులైన్ లీకవుతున్నా మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డు మధ్యలో పైపు లీక్ కావడంతో తారు రోడ్డు దెబ్బతింది. ఆ ప్రాంతమంతా బురదమయం అయ్యింది. రోడ్డు మధ్యలో నుంచి లీకైన వాటర్ పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రహరీ, విద్యుత్ సబ్ స్టేషన్ వరకు వెళ్తోంది. అక్కడే రోడ్డుకు మరోవైపు రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డులో వాహనదారులు, ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మార్జిన్ పూర్తిగా బురద కావడంతో ఆ రోడ్డులో రాకపోకలు సాగించే వాహనాలు రోడ్డుకు ఒక వైపు నుంచే వెళ్తున్నాయి. పాదచారులకు నరకం కనిపిస్తోంది. రోడ్డుపక్కన నడిచే వారిపై వాహనాలు వెళ్లే సమయంలో బురద చింది పడుతోంది. పైగా తారు రోడ్డు దెబ్బతిన్న చోట గుంతలు ఏర్పడ్డాయి. లీకైన నీరు ఆ గుంతల్లో చేరి చాలా కాలం వరకు ఉంటున్నాయి. గోతులలో నీరు నిల్వ ఉండి ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి పరిసరాలు ఎంతో పరిశుభ్రంగా ఉండాలి. కానీ ఇక్కడ మాత్రమే.. పైపులైన్ లీకు కారణంగా నీరు చేరి రోడ్డు మార్జిన్ కాలువను తలపిస్తోంది. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే రోడ్డులో పైపులైన్ లీకై నీరు వృథాగా పోతున్న అధికారులుగానీ, సిబ్బంది గానీ పట్టించుకోవడం లేదు. అటు నీరు వృథా, ఇటు చక్కటి తారు రోడ్డు దెబ్బతింటున్నా వీఎంసీ అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



పట్టణ ఆరోగ్య కేంద్రం ఎదుట రోడ్డు మధ్యలో లీకవుతున్న పైపులైన్, అధ్వానంగా రోడ్డు

అధ్వానంగా రోడ్డు..

అలాగే 43వ డివిజన్ పరిధిలో ఓల్డ్ హెచ్‌బీజీలోని పోస్టాఫీసు రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డులో ఓ వైపు ఓవర్‌హెడ్ ట్యాంక్, మరో వైపు పోస్టాఫీస్ ఉన్నాయి. దీంతో ఈ రోడ్డుకు రాకపోకలు అధికంగా ఉంటాయి. దశాబ్దాల కిందట నిర్మించిన తారు రోడ్డు కావడం.. రోడ్డు పల్లంలో ఉండటంతో వాటర్ ట్యాంక్‌లో వదిలిన నీరు, లీకైన నీరు రోడ్డుపైకి చేరుతోంది. మార్జిన్లు గడ్డితో నిండి ఉండడంతో పాటు డ్రెయిన్లు పూడిపోవడంతో నీరు బయటకు పోయే అవకాశం లేకుండా పోయింది. దీంతో రోడ్డు మార్జిన్లు బురదమయం అవుతున్నాయి. రోడ్డు మరీ అధ్వానంగా తయారైంది.



నీరు నిలిచి అధ్వానంగా మారిన 43వ డివిజన్ పరిధిలోని పోస్టాఫీస్ రోడ్డు

మార్జిన్లలో నీరు నిలిచి తారు రోడ్డు క్రమేపీ దెబ్బతింటోంది. లీకేజీలు అరికట్టాలని, దెబ్బతిన్న తారు రోడ్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీ మిగిలిన రోడ్ల మాదిరి సిమెంట్ రోడ్లు నిర్మించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు వీఎంసీలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలకసంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న బీ ఫారం పట్టాల రిజిస్ట్రేషన్ కోసం రెండు రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ఏర్పాటు చేసినట్లు వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. పాయకాపురం, కొత్త రాజరాజేశ్వరిపేటలోని పలు కాలనీల్లో ఇంకా వెయ్యి బీ-ఫామ్ పట్టాల రిజిస్ట్రేషన్ జరగాల్సి ఉందన్నారు. ఆయా ప్రాంత వాసుల సౌకర్యార్థం వీఎంసీ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ఏర్పాటు చేసిందని, ఇవి వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఈ నెల 28వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. 10 ఏళ్లగా యజమానులుగా ఉంటున్న వారికి గజం రూ.100 రిజిస్ట్రేషన్ చేసేందుకు ఈ నెల 28వ తేదీ చివరి తేదీ అని, ఆసక్తి గల ప్లాట్ ఓనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనుకునే వాళ్లు ఇంటి పట్టా, లింక్ డాక్యుమెంట్స్, యజమాని ఆధార్ కార్డ్, ఇంటి పన్ను రసీదు, ఇద్దరు సాక్షులు, వాళ్ల ఆధార్ కార్డులతో ఇంటి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.



వీఎంసీలో రిజిస్ట్రేషన్ నిర్వహిస్తున్న అధికారులు

రహదారులపై ఉన్న కేబుళ్లు వెంటనే తొలగించాలి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలోని ఆయా ప్రాంతాల్లో రోడ్లపై కేబుల్, ఇంటర్నెట్, ఇతర వైర్లు, ప్రజల భద్రతకు ప్రమాదకరంగా మారుతున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. రోడ్లపై అవసరంలేని, నిరుపయోగంగా ఉండే వైర్లను క్రమబద్ధీకరించాలని కేబుల్ యజమానులకు సూచించారు. పౌరుల భద్రతను ప్రాధాన్యంగా తీసుకుంటూ, నగర సుందరీకరణలో భాగంగా కొన్ని కీలక చర్యలు చేపట్టిందన్నారు. ఈ చర్యల్లో భాగంగా నగర పరిధిలో ఎక్కడైనా స్తంభాలకు వేలాడుతూ లేదా రోడ్లపై పడి ఉన్న కేబుల్, ఇంటర్నెట్ ఇతర వైర్లు వెంటనే తొలగించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో వైర్లను వారంలోగా తొలగించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కేబుల్ ఆపరేటర్లు ఈ విషయాన్ని గమనించి, వీఎంసీ సిబ్బందికి సహకరించాలని సూచించారు.

రోడ్లపై ఆవులను వదిలితే రూ.10 వేల జరిమానా

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని రోడ్లపై ఆవులను వదిలేసే యజమానులకు రూ.10 వేలు జరిమానా విధించనున్నట్లు వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. రోడ్లపై పశువులను వదిలిపెట్టడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, వీటి వల్ల ప్రమాదాలు కూడా అధికమవుతున్నాయన్నారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ చర్యల్లో భాగంగా, ఆవులను రోడ్లపై వదిలిపెట్టకుండా నియంత్రించేందుకు అజిత్‌సింగ్‌నగర్‌లోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాటిల్ షెడ్‌లో గోవుల ఆరోగ్య సంరక్షణ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బీఎస్ఎస్ రెడ్డి పర్యవేక్షణలో ఉంటాయని తెలిపారు.



రోడ్లపై సంచరిస్తున్న ఆవులు

ఘనంగా సినీనటుడు శోభన్‌బాబు జయంతి



మాట్లాడుతున్న రమా సత్యనారాయణ తదితరులు

విజయవాడకల్చరల్: సినీనటుడు శోభన్‌బాబు సినీ రంగసేవలను ఆదర్శంగా తీసుకోవాలని విశ్వమాతా చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. ఎస్‌కేపీ సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం సినీనటుడు శోభన్‌బాబు జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన రమాసత్యనారాయణ మాట్లాడుతూ.. శోభన్‌బాబు అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించారని, మహిళా ప్రేక్షకుల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ.. క్రమశిక్షణకు మారుపేరు శోభన్ బాబు అని అభివర్ణించారు. ఆయన గొప్ప మానవతా మూర్తి అని, పేద కళాకారులకు సహాయం చేసేవారన్నారు. జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, కె.డేవిడ్ రాజు, జయప్రభు, జోషి పాల్గొన్నారు. గాయనీ గాయకులు సుధాశ్రీనివాస్, విష్ణుప్రియ, రత్నకుమారి శోభన్‌బాబు నటించిన చిత్రాల్లోని గీతాలను ఆలపించారు.

7 నుంచి దత్తసాయి మందిరం వార్షికోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో ఫిబ్రవరి 7 నుంచి 9వ తేదీ వరకు మందిరం 10వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ ఉదయం 5.15 గంటలకు కాగడ హారతితో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. 7 గంటలకు విఘ్నేశ్వర పూజ, బాబావారికి అభిషేకం, ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి అఖండ తారక నామ మహా మంత్రం పారాయణం, సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం కోలాటం జరుగుతుందన్నారు. 8న మధురానగర్ వీధులలో బాబావారి బిక్ష సేకరణ, ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. 9వ తేదీ ఆదివారం బాబావారికి 21 దివ్య ద్రవ్యాలతో అభిషేకం, మధ్యాహ్నం అన్నాభిషేకం నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తామని చెప్పారు. శ్రీ సాయినక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం, లోక కల్యాణార్థం లక్ష్మీగణపతి హోమం జరుగుతుందన్నారు. మందిర వార్షికోత్సవాల్లో భక్తులు పాల్గొని బాబావారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

సచివాలయ ఉద్యోగుల వర్గీకరణపై పునరాలోచించాలి

గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అర్లయ్య



భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులను మూడు కేటగిరీలుగా వర్గీకరించాలని తీసుకున్న నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలని ఏపీ గ్రామ/వార్డ్ సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల అర్లయ్య ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇటువంటి నిర్ణయాలు తీసుకుని అమలు చేసే ముందు ఉద్యోగ సంఘాల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయంతో సచివాలయ ఉద్యోగులు వివిధ రూపాల్లో కష్టనష్టాలను ఎదుర్కోవలసి వస్తుందని అన్నారు. సచివాలయ ఉద్యోగుల వర్గీకరణకు సంబంధించి మార్గదర్శకాల కోసం ముగ్గురు సభ్యులతో ఏర్పాటు చేస్తామన్న కమిటీని నియమించారా లేదా, ఏర్పాటై ఉంటే అందులో సభ్యులుగా ఎవరెవరు ఉన్నారనే దానిపై కూడా ఉద్యోగులు, నేతలకు సమాచారం లేదన్నారు. తమ విభాగంలో చేపట్టనున్న మార్పులు, చేర్పులపై ఉద్యోగ సంఘాల నేతలతో కమిటీ సభ్యుల సమావేశం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ అంశంపై ప్రభుత్వంతోపాటు సంబంధిత మంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో ఐదో తరగతి అడ్మిషన్ల కోసం ఈ నెల 18వ తేదిన నిర్వహించబోయే జేఎన్‌వీ ఎంట్రన్స్ టెస్ట్-2025కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు గురువారం విలేకరులకు తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో 24 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 5,788 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరుకానున్నారని చెప్పారు. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ చేశామని వివరించారు. హాల్‌టికెట్ల జారీలో అభ్యర్థులకు ఏవైనా సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే సంబంధిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు సూచించారు. 18వ తేదీ ఉదయం 10.30 గంటలకు పరీక్ష కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలని ఆయన చెప్పారు. ప్రవేశ పరీక్ష ఫలితాల ఆధారంగానే సీట్ల కేటాయింపు జరుగుతుందని, ఈ విషయంలో విద్యార్థులు తల్లిదండ్రులు ఎలాంటి వదంతులు, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వృద్ధుడికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో వృద్ధుడు గాయపడిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుణదల ఈఎస్‌ఐ హాస్పిటల్ ప్రాంతానికి చెందిన మోకర్ల జార్జి(71) పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం టీ తాగేందుకు గుణదల మూడు వంతెనల సెంటర్ వద్దకు వచ్చి రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన జార్జిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హాస్పిటల్ నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుపయోగంగా వీఎంసీ వ్యాయామశాలలు

- యువతకు అందుబాటులో లేని జిమ్‌లు
- నిర్వీర్యమవుతున్న జిమ్ సామగ్రి
- పట్టించుకోని అధికారులు

గుణదల(విజయవాడతూర్పు): ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు పెద్దలు.. ఆరోగ్యాన్ని పెంపొందించుకునే దిశగా వ్యాయామం ఎంతగానో దోహద పడుతుంది. నడక, యోగాసనాలు, కసరత్తులు చేయటం వంటి ప్రక్రియలను అనుసరిస్తూ ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటారు. ముఖ్యంగా యువకులు జిమ్ చేయటం ద్వారా శరీర దారుఢ్యాన్ని బలపరుచుకుంటారు. గతంలో నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో వీఎంసీ స్థలాల్లో వ్యాయామశాలలు నిర్వహించేవారు. ఇప్పుడు ఆ సంస్కృతి నిర్వీర్యమైంది. సరైనా నిర్వహణ లేకపోవడంతో జిమ్‌లు మూతపడుతున్నాయి. తూర్పు నియోజకవర్గం పరిధిలోని గుణదల, మాచవరం, క్రీస్తురాజపురం తదితర ప్రాంతాలలో వ్యాయామశాలలు నిర్వీర్యం కాగా మరి కొన్ని ప్రాంతాలలో అసలు వీఎంసీ జిమ్‌లే లేవు. ఈ జిమ్‌లపై అధికారులు దృష్టి సారించాలని స్థానిక యువత కోరుతున్నారు.

యువకుల కసరత్తులు..

వీఎంసీ వ్యాయామశాలల్లో నామమాత్రపు రుసుముతో యువకులు బాడీ బిల్డింగ్ చేస్తుంటారు. అతి తక్కువ ఖర్చుతో జిమ్‌లు అందుబాటులో ఉండటంతో యువకులు, పెద్దలు సద్వినియోగం చేసుకునే వారు. డంబెల్స్ మోస్తూ, వెయిట్ లిఫ్టింగ్ చేస్తూ శారీరకంగా బలపడే వారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కసరత్తులు చేసుకునే పరిస్థితి ఉండేది. అనంతరం ఆ వ్యక్తులు ఇంటి వద్ద పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యాన్ని పెంపొందించుకునే వారు.



మూతబడిన గుణదల వ్యాయామశాల

జిమ్ సామగ్రి నిర్వీర్యం..

వీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జిమ్‌లలో కసరత్తులు చేసుకోవడానికి అవసరమైన లక్షలాది రూపాయల విలువ చేసే సామగ్రి ఉంటుంది. ఐరెన్ డంబెల్స్, ట్రెడ్ మిల్, అధిక బరువులు ఎత్తడానికి ఇనుప రాడ్లు, ప్లేట్లు ఇతరత్రా సామగ్రి ఉంటుంది. ఎవరు ఏ విధంగా ఆ సామగ్రిని ఉపయోగించి కసరత్తులు చేయాలో ఓ కోచ్ ఉంటాడు. కసరత్తులలో మెలకువలు నేర్పిస్తూ యువకుల శారీరక దారుఢ్యాన్ని పెంచేందుకు కోచ్ కృషి చేస్తారు. నిర్ణీత సమయాల్లో జిమ్ నడుపబడుతుంది. ఈ కోచ్‌లకు జీత భత్యాలు వీఎంసీ చెల్లిస్తోంది. వీఎంసీ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో జిమ్‌లు మూతపడ్డాయి. ఫలితంగా జిమ్‌లో ఉండే సామగ్రి నిర్వీర్యమైపోతోంది.

జిమ్‌లను పునరుద్ధరించాలి..

నేను ప్రస్తుతం బీటెక్ పూర్తి చేసి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నా. గతంలో గుణదల ఈఎస్‌ఐ రోడ్డులో ఉన్న వీఎంసీ జిమ్‌కు వెళ్లే వాడిని. అక్కడ ప్రతి రోజు ఉదయం వ్యాయామం చేసి వచ్చే వాడిని. కేవలం నెలకు రెండు వందలు మాత్రమే ఫీజు తీసుకునేవారు. కోచ్ మెలకువలు నేర్పి, ఆహార నియమాలు చెప్పి బాడీ బిల్డింగ్‌కు సహకరించే వారు. గత కొంత కాలంగా ఈ జిమ్ మూతబడి ఉంది. స్థానికంగా ఉండే యువకులు వ్యాయామం చేయటమే మానేశారు. ఇప్పటికైనా వీఎంసీ అధికారులు ఈ జిమ్‌ను పునరుద్ధరించాలి.

– జి.సురేష్, స్థానికుడు, గుణదల

ఆదరణ కరువు..

ఆరోగ్యాభిలాషులు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో జిమ్‌ల సంస్కృతి పెరిగిందనే చెప్పాలి. సంపన్న వర్గాలకు చెందిన వారు మాత్రమే జిమ్‌లకు వెళ్లి వ్యాయామాలు చేసుకునే పరిస్థితి నెలకొంది. తక్కువ ఖర్చుతో నిర్వహించబడే వీఎంసీ వ్యాయామశాలలు మూతబడటంతో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన ప్రజలు జిమ్‌లకు దూరమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఫలితంగా కేవలం వారి ఉద్యోగ, వ్యాపారాలకు మాత్రమే పరిమితమై దైనందిన జీవితంలో యాంత్రికంగా జీవనం వెళ్లదీస్తున్నారు. కాలక్రమేణా మానసిక ఒత్తిళ్ల కారణంగా శారీరకంగా కూడా బలహీన పడి రోగాల బారిన పడుతున్నారు.

వ్యక్తి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బీడీలు తెచ్చుకుంటానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గొల్లపూడి సాయిపురం కాలనీకి చెందిన తన్నీరు లక్ష్మయ్య(60) ఈనెల 13వ తేదీ మధ్యాహ్నం బీడీలు తెచ్చుకుంటానని ఇంట్లో చెప్పి బజారుకు వెళ్లాడు. ఆ తర్వాత ఇంటికి తిరిగి రాలేదు. అప్పటి నుంచి అతని భార్య, కుమారుడు ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో పోలీసులను ఆశ్రయించారు.

పెనమలూరులో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్

- భవన నిర్మాణం పూర్తి
- పరికరాలు అందుబాటులోకి వస్తే త్వరలో ప్రారంభం

పెనమలూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణం పూర్తయ్యింది. వివిధ రకాల వైద్య పరీక్షలకు సంబంధించి అత్యాధునిక వైద్య పరికరాలు, అనుభవం కలిగిన సిబ్బందిని నియమించాల్సి ఉంది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలో ప్రజలకు అన్నిరకాల వైద్య పరీక్షలకు మైక్రో బయాలజీ ల్యాబ్ పెనమలూరు పీహెచ్‌సీలో ఏర్పాటు చేయాలని గతంలో నిర్ణయించారు. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) 15వ ఫైనాన్స్ హెల్త్ గ్రాంట్స్ రూ. 50 లక్షల నిధులతో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. గత ఆగస్టులో భవన నిర్మాణానికి పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో శంకుస్థాపన చేశారు. ఈ భవన నిర్మాణం పూర్తి కాగా అందులో త్వరలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను ప్రారంభించనున్నారు.

అన్ని రకాల వైద్య పరీక్షలు..

మైక్రో బయాలజికల్ ల్యాబ్ ద్వారా ఇక్కడ సేవలు అందించనున్నారు. బీపీ, సుగర్, వివిధ రకాల రక్త పరీక్షలు, థైరాయిడ్, లివర్, కిడ్నీ ఇలా అన్నిరకాల పరీక్షలు ఇక్కడే చేస్తారు. దీని వల్ల పేషెంట్ ఎటువంటి వ్యాధితో ఇబ్బంది పడుతున్నారనే విషయం నిర్ధారణ అవుతుంది. బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ ద్వారా పేషెంట్‌కు కచ్చితంగా వ్యాధి నిర్ధారణ చేయగలుగుతారు. పరీక్షలు చేసిన తరువాత వచ్చే రిపోర్టు ఆధారంగా వైద్యులు పూర్తి అవగాహనతో నాణ్యమైన వైద్యం అందించటానికి ఆస్కారం ఉంటుంది.

పూర్తి స్థాయిలో సేవలు అందుతాయా..?

కాగా నేషనల్ హెల్త్ మిషన్ ముందుకు వచ్చి రూ. 50 లక్షలు నిధులు కేటాయించటంతో సకాలంలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణం పూర్తి చేశారు. అయితే అన్ని వైద్య పరీక్షలకు సంబంధించి ఆధునిక వైద్య పరీక్ష పరికరాలు ఇక్కడ ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకు రావాల్సి ఉంది. వైద్య పరికరాలు, అనుభవం కలిగిన ప్యాథాలజీ, మైక్రోబయోలజీ, ల్యాబ్ టెక్నిషియన్స్, ఇతర అనుభవం కలిగిన సిబ్బందిని నియమించాల్సి ఉంది. అయితే పరికరాలు, అనుభవం కలిగిన సిబ్బంది నియామకం ఇంకా జరగలేదు.



పెనమలూరులో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్